# అంబటి కృష్ణ మానసిక పరిస్థితి బాగులేదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణ మానసిక పరిస్థితి సరిగా లేదని తాము భావిస్తున్నామని, డీసీసీ అధ్యక్ష పదవికి ఆయన అనర్హుడని, ఆయన్ను వెంటనే తప్పించాలని జిల్లా కాంగ్రెస్ నేతలు తీర్మానించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల్ని ఇరుకున పెట్టే విధంగా ఆయన వ్యవహారం ఉందని, గత ఎన్నికల్లో టిక్కెట్లు అమ్ముకున్నారంటూ మీడియా ముఖంగా చెప్పిన అంబటి తీరు మీద అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. తామెవరం ఎమ్మెల్యే టిక్కెట్ల కోసం ఎవరికీ రూపాయి ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీకి టిక్కెట్లు అమ్ముకునే అవసరం కూడా లేదని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. బి-ఫారంపై సంతకం చేసి స్వయంగా ఆమె చేతుల మీదుగానే టిక్కెట్లు ఇచ్చిన షర్మిలపై పరోక్షంగా ఆయన విమర్శలకు దిగడం తగదన్నారు. ఇందిర విజ్ఞాన్‌భవన్‌లో షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగితే రెండు రోజుల తర్వాత ఫిర్యాదుచేసి కాంగ్రెస్ నాయకులు తగులబెట్టారని పోలీసులకు చెప్పడం, ఆ తర్వాత మీడియా సాక్షిగా క్షమాపణలు చెప్పడం, ఇవన్నీ చూస్తుంటే మానసికంగా ఆయన ఆరోగ్యంగా లేరని అర్థమవుతుందన్నారు. గడిచిన ఎన్నికల్లో శ్రీకాకుళంలో పైడి నాగభూషణంకు టిక్కెటిచ్చి చివరి నిమిషంలో తనకు టిక్కెట్ తెచ్చుకోవడం కోసం చేతులు తడపకతప్పలేదని స్వయంగా అంబటి కృష్ణే ప్రచారం చేసిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఏఐసీసీ సభ్యులు రాకేష్‌రెడ్డి పర్యటనలో స్వయంగా పాల్గొన్న అంబటి తనకు తెలియకుండానే రాకేష్ రెడ్డి జిల్లాలో పర్యటించడం ఏమిటని ప్రకటించడం ఆయన మానసిక స్థితికి అద్దంపడుతుందన్నారు. ప్రకటన విడుదల చేసినవారిలో పేడాడ పరమేశ్వరరావు, సనపల అన్నాజీరావు, ఎం. చక్రవర్తిరెడ్డి, కె.వెంకటరావు, మంత్రి నర్సింహమూర్తి, కరిమజ్జి మల్లేశ్వరరావులు ఉన్నారు.










సంచలన సాయంకాల పత్రిక

# సత్యం


https://www.satyamdaily.net/

మంగళవారం 17-9-2024

సంపుటి: 20 సంచిక: 149

పేజీలు: 4 వెల: రూ.1


# కొత్త ప్రభుత్వం మరీ 'స్మార్ట్'



గత ప్రభుత్వంలో విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించడం మీద నేరుగా అసెంబ్లీలోనే పెద్ద ఎత్తున చర్చ జరిగిన విషయం ఎవరూ మర్చిపోరు. అప్పట్లో ప్రతిపక్షం దీన్ని వ్యతిరేకించింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా స్మార్ట్ మీటర్ల బిగింపు ఆగడంలేదు. ప్రస్తుతం జిల్లాకు 500 మీటర్లు రావడంతో వాటిని అమరుస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వ కార్యాలయాలే. ఆ తర్వాత వాణిజ్య వినియోగదారులకు ఇస్తారు. వారి సంఖ్య 70వేలకు పైగా ఉంది. ఈ రెండు కేటగిరీలు పూర్తయ్యాక గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను అందిస్తారు. వారిలో కూడా అత్యధికంగా విద్యుత్‌ను ఉపయోగించే వారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. రాయితీ విద్యుత్ వినియోగించుకునే వారికి, తక్కువ మొత్తంలో విద్యుత్ బిల్లు వచ్చేవారికి స్మార్ట్‌మీటర్లు ఇవ్వరు.

- జిల్లాకు వచ్చిన 500 మీటర్లు
- తొలిదశలో ప్రభుత్వ కార్యాలయాలకు బిగింపు
- వచ్చే ఏడాది గృహ వినియోగదారులకు వాయింపు
- వేలల్లో ఉద్యోగాలు గల్లంతు
- ప్రీపెయిడ్ విధానాన్ని అవలంభిస్తున్న కూటమి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొబైల్ ఫోన్‌కు ప్రీపెయిడ్ కనెక్షన్ తీసుకున్నట్టే విద్యుత్ వినియోగానికి కూడా ముందుగానే చెల్లించి అవసరాలకు అనుగుణంగా విద్యుత్‌ను వాడుకోవడమనే విధానం ఏ మేరకు మనలాంటి రాష్ట్రాల్లో సత్ఫలితాలిస్తుందో పక్కన పెడితే ఇది రాష్ట్రంలోనే పైలట్ ప్రాజెక్టు. గత ప్రభుత్వం ముందుగా రైతులకు ఈ మీటర్లు అందించింది. అప్పట్లో పెద్ద ఎత్తున ఆందోళన ఎదురవడంతో ఆ బిల్లులు తామే చెల్లిస్తామని పేర్కొంది. అయితే ఇది ఎంతమేరకు, ఎంతమందికి వర్కవుట్ అయిందో తెలియదు. ఇటీవల కొత్త ప్రభుత్వం విద్యుత్ పాలసీ మీద శ్వేతపత్రం విడుదల చేసినప్పుడు కూడా ఈ విషయం ప్రస్తావించలేదు. కాబట్టి ఇది మంచిదా, చెడుదా అనే విషయాలు పక్కన పెడితే స్మార్ట్ మీటర్ల వల్ల ఉన్న ఫలంగా ఎఫెక్ట్ అయ్యేది సంస్థలో పని చేస్తున్న ఒక స్థాయి ఉద్యోగులే. మీటరు రీడింగ్ దగ్గర్నుంచి బిల్లులు చెల్లింపు వరకు విద్యుత్ సంస్థలో ఒక వ్యవస్థ పని చేస్తుంది. ఇప్పుడు అటువంటి ఉద్యోగులందరికీ భద్రత లేకుండా పోతుంది. టెక్నాలజీ పెరిగినప్పుడు సంప్రదాయ ఉద్యోగాలు ఎగిరిపోవడం సాధారణం. అయితే పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అందుబాటులోకి వస్తే ఏం జరుగుతుందో ఊహించడానికి ఇది ఒక మచ్చుతునక మాత్రమే. ట్విమ్స్ మిషన్ల అమలు తర్వాత ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగాలు కుదించబడి సర్‌ప్లస్ సిబ్బంది డ్రైవర్లుగా మారిపోయారు. అలాగే ఆర్టీసీలో నియామక ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. విద్యుత్ రంగంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటువల్ల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో పాలిటెక్నిక్, ఐటీఐ వంటి అర్హతలతో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీస్కిల్డ్ ఉద్యోగాలు గల్లంతవుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ విద్యుత్ వినియోగానికి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు 2022లో వైకాపా ప్రభుత్వం ప్రకటించడమే తడువు అప్పటి ప్రతిపక్ష, విపక్ష పార్టీలు విరుచుకుపడ్డాయి. యువగళం యాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఒక్క అడుగు ముందుకేసి వ్యవసాయ వినియోగానికి ప్రభుత్వం ఏర్పాటుచేసే స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు రైతులు అంగీకార పత్రాలు ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లను తొలగిస్తామని ప్రకటించారు. అయినా అప్పటి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లను వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు బిగించింది. ఆపరేషన్ సర్కిల్ పరిధిలో 29,638 వ్యవసాయ విద్యుత్

- మిగతా 4లో







• ఎడిటోరియల్

# రాహులేం మారలేదు..!

మోడీకి ముందు ప్రధానులైనవారెవరూ విదేశాల్లో మన దేశ అంతర్గత రాజకీయాలపై ప్రస్తావించినట్లు మనకు తెలియదు. ఆ సంప్రదాయాన్ని ప్రారంభించింది మోడీయే. ఆ తర్వాత రాహుల్‌గాంధీ కూడా విదేశాల్లో మన అంతర్గత రాజకీయాలు మాట్లాడటం మొదలుపెట్టారు. మోడీ మాట్లాడితే రాహుల్ మాట్లాడాలని ఎక్కడ ఉంది? ఆ ప్రివిలైజ్, ఘనత, రికార్డ్ మోడీకే వదిలేసుంటే బాగుండేది. ఆయన మాట్లాడలేదా? అని వీరు, వీరు మాట్లాడలేదా? అని వారు పరస్పర నిందారోపణలు చేసుకోవడం వల్ల ప్రయోజనం శూన్యం. పైగా ఇక్కడ ఇంకో రాజకీయ సూక్ష్మం కూడా ఉంది. మోడీ ప్రధాని అయ్యాక మాట్లాడారు. రాహుల్ ఇంకా ప్రధాని కాలేదు. ప్రధాని కావాలి అని రాహుల్ అనుకుంటే మోడీ చేసిన పొరపాటును ఆయన చేయకూడదు కదా. కచ్చితంగా ఆయన తన సొంత బ్రాండ్‌ను నిర్మించుకోవాలి. 2015లో చైనాలో ప్రధాని మోడీ భారత సంతతి వారితో మాట్లాడుతూ గతంలో మీరందరూ భారతీయులం అని చెప్పుకునేందుకు సిగ్గుపడ్డారు, ఇప్పుడు గర్వపడుతున్నారా? అని అడిగారు. ఇలా ఆయన ప్రసంగ ధోరణి సాగింది. మోడీ అభిమానులకు ఇందులో ఏముంది, ఆయనన్నది నిజమే కదా అనిపిస్తుంది. రాహుల్ అభిమానులకు దీనికి పూర్తి వ్యతిరేకంగా అనిపిస్తుంది. దురదృష్టం ఏమిటంటే.. దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ ఇవాళ రాజకీయాలు ఇలాగే తగలడ్డాయి. నాయకులు గుర్తుంచుకోవాల్సిన విషయమేమిటంటే.. వారు ఎంత చెండాలంగా ప్రవర్తించినా, ఎంత ఘోరంగా పాలించినా వారి ఓటుబ్యాంకు వారికుంది. 2019లో 23 సీట్లు వచ్చిన టీడీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. 2024లో 11 సీట్లు వచ్చిన వైకాపాకు కూడా 40 శాతం ఓట్లు వచ్చాయి. కొంపముంచేది తటస్థుల ఓట్లే. వీరు బయటపడి మాట్లాడరు. మౌనంగా ఓట్లేసి కొంపముంచుతారు. మోడీ, రాహుల్ ఎక్కడెక్కడ ఏం మాట్లాడారో ఇప్పుడు చర్చకు తెర లేపింది. బాగానే ఉన్నాడు, బాగానే జనంలోకి వెళ్తున్నాడనే లోపు ఏదో ఒకచోట నోరు జారి బీజేపీకి రాహుల్ అవకాశం ఇస్తున్నారు. సిక్కులు భయాందోళనలో ఉన్నారని, స్వేచ్ఛ లేకుండా బతుకున్నారని, ప్రార్థనలు చేసుకునే స్వేచ్ఛ కూడా లేదని ఆమధ్య విదేశీ టూర్‌లో రాహుల్ చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఖలిస్తానీ వేర్పాటువాదం మళ్లీ జడలు వేసుకుంది. ఇదే వేర్పాటువాదులు రాహుల్ నాయినమ్మ ఇందిరాగాంధీని పొట్టన పెట్టుకున్నారు. ఆ సమయంలో దేశంలో చెలరేగిన అల్లర్లలో సిక్కులు పెద్ద ఎత్తున ఊచకోతకు గురయ్యారు. బహుశా ఈ పాపాన్ని కడిగేసుకోవడం కోసం రాహుల్ సిక్కులకు అనుకూలంగా మాట్లాడివుండొచ్చు. కానీ కెనడాలో ఇప్పటికే ఖలిస్తాన్ ఉద్యమం ఊపందుకోవడం, అక్కడి నుంచి భారత్‌కు ఫండింగ్ జరగడం, ఇక్కడ ఎర్రకోట మీద ఖలిస్తాన్ జెండా ఎగురవేయడం వంటివి పూర్తిగా దేశ అంతర్గత వ్యవహారం. దీనిని బయట మాట్లాడటం రాహుల్ అపరిపక్వతకు నిదర్శనం. మన దేశంలో ఇందుకోసం చట్టసభలు ఉన్నాయి. వాక్ స్వాతంత్ర్య హక్కు ఉంది. నిరసన తెలిపే హక్కు ఉంది. ఇక్కడ సిక్కుల కోసం మాట్లాడకుండా అమెరికాలో మాట్లాడటం రాహుల్ బీజేపీకి ఊతమిచ్చినట్లయింది. మన దేశంలో రిజర్వేషన్ వ్యవస్థపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశంలో దుమారం రేపుతున్నాయి. శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడీ అయితే రాహుల్ నాలుక కోసి తెస్తే రూ.11 లక్షలు ఇస్తానని వివాదాస్పద వ్యాఖ్యలు కూడా చేశారు. అడుసు తొక్కనేల, కాలు కడగనేల అనే పరిస్థితిలోకి రాహుల్ వచ్చేశారు. హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గెలుపు అవకాశాలు ఉన్నాయనుకుంటున్న తరుణంలో ఆయన బీజేపీ కూటమికి బలం చేకూర్చే పనులు చేస్తున్నారు. ఆమధ్య వినాయక చవితి సందర్భంగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఇంటిలో జరిగిన పూజ కోసం ప్రధాని మోడీని ఆహ్వానించారు. పూజకు మోడీ కూడా వెళ్లారు. దీనిని రాజకీయంగా వాడుకోవాలని చూసి ఇండియా కూటమి బోర్లాపడింది. గతంలో కాంగ్రెస్ ప్రధాన మంత్రులు వెళ్లిన పార్టీలు ములాకాత్‌లు, ఇఫ్తార్‌ల కోసం బీజేపీ దెప్పిపొడిచింది. వాస్తవానికి ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ కేరెక్టర్‌ను తక్కువ చేసే స్థాయి సరికాదు. చంద్రచూడ్ ఈ ఏడాది నవంబరు 9న పదవీ విరమణ చేస్తున్నారు. ఇంకో విషయమేమిటంటే.. చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఇచ్చిన చాలా తీర్పులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగానే వచ్చాయి. ఉన్నత పదవుల్లో ఉన్నవారికీ వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుంది. అదే న్యాయమూర్తుల విషయంలో కొన్ని కఠినమైన ప్రోటోకాల్స్ ఉంటాయి. అలా అని తన ఇంట్లో జరిగే శుభకార్యాలకు ఎవర్ని పిలవాలో, ఎవర్ని పిలవకూడదో నియమ నిబంధనలూ ఉంటాయి. చంద్రచూడ్ లాంటి నిజాయితీపరుడ్ని ఇందులోకి లాగి మరో తప్పు చేశారు. నెహ్రూ నుంచి మన్మోహన్, సోనియాలు ఏయే సందర్భాల్లో ఎవరెవరితో కలిశారో ఫొటోలతో సహా బీజేపీ సోషల్ మీడియా బయటపెట్టింది. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడటం అంటే ఇదే. అమెరికా పర్యటనలో ఒక భారతీయ విద్యార్థి ఇండీ అలయెన్స్ కోసం అడిగాడు. దానికి రాహుల్ బదులిస్తూ ఇండీ అలయెన్స్ బీజేపీ ఫ్రేమ్ చేసిందన్నారు. అయితే అందులో 'ఎ' అంటే అర్థమేమిటని అడిగితే రాహుల్ నీళ్లు నమిలారు. విదేశీ గడ్డ మీద దేశానికి సంబంధించిన అంశాలు మాట్లాడుతున్నప్పుడు ఒక బావిభారత ప్రధాని ఎలా మాట్లాడకూడదో రాహుల్ నేర్చుకోవాలి. బీజేపీ మీద వ్యతిరేకత ఒక్కటే తనను అధికారంలోకి తెస్తుందనుకోవడం తప్పు. ఖలిస్తాన్ ఉగ్రవాదులను వెనకేసుకు రావడం మరో పెద్ద తప్పు. ఇప్పటికే అమెరికాలో ఉన్న ఖలిస్తాన్ నాయకుడు పన్నూ మన పార్లమెంట్ మీద దాడి చేస్తానని ప్రకటిస్తాడు. పంజాబ్‌లో ఖలిస్తాన్ వేర్పాటువాదులు గెలుస్తున్నారు. ఈ సమయంలో ప్రతిపక్షం సంయమనం పాటించకపోతే దేశం మరోసారి చీలిపోతుందని రాహుల్ గుర్తించాలి.

# దేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించాలి

- స్వచ్ఛ శ్రీకాకుళంలో అందరూ భాగస్వాములు కావాలి
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించేందుకు శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రాము మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. దేశం అభివృద్ధితోపాటు పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకునేందుకు 10ఏళ్ల క్రితం దేశాన్ని స్వచ్ఛత వైపు తీసుకువెళ్లాలని గాంధీని ఆదర్శంగా తీసుకొని స్వచ్ఛభారత్‌ను ప్రారంభించామన్నారు. దేశమంతా పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో 14రోజులపాటు స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ పారిశుధ్యం నిర్వహణ అందరి బాధ్యతన్నారు. అందరి సహకారంతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్వయం సహాయకసంఘాల సభ్యులు, యువతీ యువకులు, స్వచ్ఛందసంస్థలు, సీనియర్ సిటిజన్స్, పారిశ్రామికవేత్తలు, వ్యాపారసంస్థలు భాగస్వామ్యం కావాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం "స్వచ్ఛతా హీ సేవ" కార్యక్రమం 14 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 వరకు "స్వభావ్ స్వచ్ఛతా- సంస్కార్ స్వచ్ఛత" అనే ఇతివృత్తం ద్వారా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వచ్ఛత పట్ల మన స్వభవంలోనూ, సంస్కారంలోనూ మార్పు రావాలన్నారు. ఈ కార్యక్రమం మూడు ముఖ్యమైన అంశాల ప్రాతిపదికన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. స్వచ్ఛ శ్రీకాకుళం జిల్లాగా స్వచ్ఛగ్రామాలు, వార్డులుగా రూపుదిద్దేందుకు సహకరించాలన్నారు. 15రోజులలో గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా చేసి దేశ స్థాయిలో గుర్తింపు, అవార్డులు తీసుకొని రావడంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు కలిసికట్టుగా పాల్గొని స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ఆయా మండలాల్లో విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మందుగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ దుస్తులు అందజేశారు. అక్కడ నుండి బయలుదేరి హెచ్‌బి కాలనీ వెనుక వైపు పార్కులో స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. బి.మీనాక్షి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, మున్సిపల్ కార్యాలయ అధికారు లు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.




# 18 కిలోల గంజాయి స్వాధీనం

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)



ఒడిశాలోని కోదలా ఏరియా రాంపల్లి గ్రామం నుంచి 18.190 కేజీల గంజాయిని ముంబైకు తరలిస్తుండగా సోంపేట రైల్వేస్టేషన్ వద్ద సోమవారం నిందితుడిని పట్టుకొని అరెస్ట్ చేశారు. ఈమేరకు కంచిలి పోలీసు స్టేషన్‌లో అదనపు ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు విలేకరుల సమావేశం నిర్వహంచి వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని గంజాం జిల్లా, కోదలామండల్, సతనాలా గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ సాహును అదుపులోకి తీసుకొని ఆయన్నుంచి 18.190 కేజీల గంజాయి, ఒక ట్రాలీ సూట్‌కేస్, ఒక బ్యాగ్, మొబైల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. ఒడిశా కొదల రాంపల్లి గ్రామానికి చెందిన సంజయ్, సాగర్ అనే ఇద్దరు వ్యక్తులు సమకూర్చిన గంజాయిని ముంబైకి చెందిన ముఖేష్‌కు అప్పగిం చడానికి సంతోష్‌కుమార్ సాహు వెళుతుండగా ఎస్ఐ రాజేష్ ఆయన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసకున్నారు.




## అమ్మ ఫౌండేషన్‌లో డ్రైవర్స్ దినోత్సవ వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం బలగమెట్టు దారిలోని అమ్మ ఫౌండేషన్‌లో డ్రైవర్స్ దినోత్సవ వేడుకలు శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ రాడ గణపతి మాట్లాడుతూ డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా అమ్మ ఫౌండేషన్ ప్రాంగణంలో శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపికచేసిన పేద విద్యార్థులకు నిత్యావసర సరుకులు, పుస్తకాలు, పళ్లు, కూరగాయలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని, శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సూచనల మేరకు డ్రైవర్ల దినోత్సవాన్ని అమ్మ ఫౌండేషన్‌లో జరుపుకున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పర్ల రాము, ప్రధాన కార్యదర్శి పమ్మిన నరేష్, ఎస్పి శ్రీను, కిల్లి రాము, బోనెల శంకర్రావు, నాగరాజు మురళి, తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన జిల్లా విజిలెన్స్ ఎస్పీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డిని జిల్లా విజిలెన్స్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బర్ల ప్రసాద్ మంగళవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం పలు ముఖ్యమైన అంశాలపై మాట్లాడుకున్నారు.

## చంపాగల్లివీధిలో విశ్వకర్మ ఉత్సవాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో చంపాగల్లివీధిలో విశ్వకర్మ భగవాన్ ఆరాధనా మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 21 వరకు విశ్వకర్మ పంచరాత్రులు, పూజా మహోత్సవాలు జరుగుతాయని, శ్రీ కామాక్షిదేవి పట్టణ స్వర్ణకార సంఘం, జిల్లా స్వర్ణకార సంఘం, పట్టణ స్వర్ణకార యూత్ కమిటీ, జిల్లా విశ్వబ్రాహ్మణ, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలకు విశ్వబ్రాహ్మణులతో పాటు స్వర్ణకారులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సాతివిల్లి శ్రీనివాసరావు, పట్నాల రామశంకరరావు, దాకోజు అమర్‌నాథ్, కడారి దుర్గాప్రసాద్, టి.సూర్య ప్రకాశరావు నేతృత్వంలో విశ్వకర్మ ఆరాధనా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.



## స్వచ్ఛ కొర్లకోటకు సహకరించండి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

స్వచ్ఛభారత్ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా మంగళవారం కొర్లకోట పంచాయతీలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పల నాయుడు, ఎంపీటీసీ అన్నపు భాస్కరరావుల ఆధ్వర్యంలో స్వచ్ఛ కొర్లకోట కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ, మానవహారం నిర్వహించారు. అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ ఆమదాలవలస సాధ్యపడుతుందని ఈవోపీఆర్డి గోవిందరావు తెలిపారు. గ్రామంలో మహిళా సంఘాలు, పెద్దలంతా బాధ్యత తీసుకొని స్వచ్ఛ కొర్లకోటకు సహకరించాలని ఏపీఎం పైడి కూర్మారావు సూచించారు. గ్రామ పరిసరాలు జనావాసాల్లో మురికి, చెత్త, పెంట కుప్పలు లేకుండా ప్రతి కుటుంబం స్వచ్ఛత పాటిస్తూ, స్వచ్ఛకొర్లకోటకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాగర్‌తోపాటు క్లస్టర్ కోఆర్డినేటర్ రమణ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, వెలుగు, ఐసిడిఎస్, ఆశ వర్కర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




సత్యం సినిమా సత్యం సినిమా సత్యం సినిమా సత్యం సినిమా సత్యం సినిమా

భానుమతిగారికి చక్రపాణి అంటే ప్రత్యేకాభిమానం... ఆయనకి కూడా.. అయితే విజయా బ్యానర్‌లో భానుమతిగారు ఒక్క సినిమాలో కూడా చేయలేదు. అయితే ఒకే ఒక్క సినిమాలో ఆవిడ సెలక్ట్ అయ్యారు. ఆ సినిమా పేరు మిస్సమ్మ. అందులో ఆవిడ నటిస్తుండగా ఏవో వ్రతాల గొడవ వచ్చి... ఆవిడ ప్లేసులో సావిత్రిగారు వచ్చారు. అయితే దీపావళి వస్తుంటే చాలు చక్రపాణి గారు భానుమతిగారింటికి వెళ్లి మరీ .. మరేంటి దీపావళి స్పెషలుకు కథేం రాస్తున్నావ్ అని అడిగేవారట. అలాగే మల్లీస్వరి సినిమా రికార్డింగ్ జరుగుతూండగా ... ఘంటసాల , భానుమతి ఇద్దరిలో ఎవరు బాగా పాడతారని కనిపించిన వాళ్నల్లా అడిగేవారట చక్రపాణి. ఫైనల్‌గా తన అభిప్రాయంగా ఘంటసాలే బాగా పాడతారని చెప్పేవారట. దానికి ఆయన చెప్పిన రీజనింగు ఘంటసాల చుట్టతాగుతాడు.. భానుమతి తాగదు కదా అని ... ఇలా ఎన్ని జోకులేసినా... చక్రపాణిగారంటే భానుమతిగారికి ప్రత్యేక అభిమానం..ఆవిడ చక్రపాణి గారిని పాత్రగా పెట్టి కథలు రాసేవారు.

ఆ జాబితాలో చక్రపాణి రంభ అనే కథ ఒకటి... అలాగే చక్రపాణిగారోసారి భూమ్మీదకు వస్తే అనే కథ ఒకటి... నాకు గుర్తున్నవి. చక్కన్న ఓ సారి భూమ్మీదకు వస్తే అనే ఆలోచనతో భానుమతి రాసిన కథ మంచి కామెడీగా సాగుతుంది. చక్రపాణిగారిని అంతగా అర్థం చేసుకున్న వారు మరొకరు కనిపించరనిపించేంతగా బాగుంటుందా కథ... లైలా మజ్నూలో భానుమతి పక్కన నాగేశ్వరరావు హీరోగా వేస్తున్నాడనే సరికి చక్రపాణితో సహా అలనాటి స్టార్ ప్రొడ్యూసర్లు అందరూ కాస్త ఖంగారు పడ్డారట. విషయం ఏమంటే... నాగేశ్వరరావు శరీర సౌష్టవం రీత్యా భానుమతికి తమ్ముడులా అనిపిస్తాడనేది వీరి నమ్మకం... అయితే దీనికి భానుమతి ధీటుగా స్పందిస్తూ... మా ఆయన పర్సనాల్టీ కూడా నాగేశ్వరరావులానే ఉంటుందే అన్నారట... అలాగే నాగేశ్వరరావూ నేనూ చాలా వరకు వేరువేరు చోట్ల బాధపడతాము తప్ప కలసి పడము కదా అన్నారట. సరే ఫైనల్‌గా సినిమా తీసి విడుదల చేశారను కోండి..

– రంగావఝల భరద్వాజ



భానుమతి ఎనభైఏడు ప్రాంతాల్లో దూరదర్శన్‌కు ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఇద్దరు మహానటులతో నటించారు మీకెలా అనిపించింది అని ప్రశ్నించారు యాంకరు.. అయితే విచిత్రంగా భానుమతిగారేమన్నారంటే... ఇద్దరు మహానటులా... వారెవరు... అని యాంకర్‌ను భయంపెట్టారు... నాగేశ్వరరావు గురించి మాట్లాడుతూ మా ఆయనకు ఆయన ఫ్రెండు కాబట్టి చాలా మా సినిమాల్లో తను కనిపిం చేవాడు తప్ప మరేం లేదనేశారా విడ...అలా అలవోకగా అనేసే భానుమతి ఎన్టీఆర్ చనిపోయిన ప్పుడు సంస్మరణ సభలో పాల్గొ నడానికి వచ్చి మెట్ల మీదే కూలిపో వడం ఆతర్వాత లేచి మాట్లాడ డం చాలా మందిని కలచివేసిం ది. ఏమైనా భానుమతీ జిందాబాద్!!

# భానుమతీ జిందాబాద్!!

## స్మాల్ సర్వీస్ టు సొసైటీ సాయం రూ.25 వేలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బాకర్ సాహెబ్‌పేటకు చెందిన బద్రి రాజేశ్వరికు రూ.25 వేలు ఆర్థికసాయాన్ని మంగళవారం అందించి స్మాల్ సర్వీస్ టు సొసైటీ మానవత్వం చాటుకున్నారు. ఆర్థికసాయంతోపాటు రైస్, నిత్యావసర సరుకులను అందించారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ కరోనాలో భర్త మృతి చెందడంతో రాజేశ్వరి రోజు కూలీగా ఇద్దరు ఆడపిల్లలతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సాయం కోసం స్మాల్ సర్వీస్ టు సొసైటీ ప్రతినిధులను సంప్రదించగా కలివరపు సూర్యప్రకాష్ ఆయన మిత్రులు, దాతల సహకారంతో చిరుసాయాన్ని అందించామన్నారు. అనంతరం రాజేశ్వరి, సాయాన్నందించిన స్మాల్ సర్వీస్ టు సొసైటీ సభ్యులకు, సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ కిరణ్, మండల మన్మదరావు, చీపురు రామ్మోహన్, లొట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తూర్పుకాపు ఆధ్వర్యంలో నిత్యావసరాలు

(సత్యంన్యూస్, విజయవాడ)

విజయవాడ పట్టణం ఓల్డ్ రాజరాజేశ్వరిపేటలో నివశిస్తున్న వరద బాధితులు 200తూర్పుకాపు కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్, రాష్ట్ర అధ్యక్షులు ఆకుల అప్పల సూరినాయుడు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రముఖ సామాజిక సేవకులు, గొప్ప మానవతావాది అయిన ఆకుల అప్పలసూరినాయుడు తూర్పుకాపు సంఘానికి రాష్ట్ర అధ్యక్షులు కావటం జాతి యావత్ గర్వించదగ్గ అంశం అని అన్నారు. విజయవాడలో తూర్పుకాపు సామాజికవర్గం ప్రజలు ఇబ్బందులకు గురుకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. నిత్యావసర సరుకుల పంపిణి కార్యక్రమం వరద బాధితులుగా ఉన్న ప్రతీ తూర్పుకాపు కుటుంబానికి విడతలవారీగా పంపిణీ చేసి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహంతి రమణారావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శిలు ఎలకల శ్రీనివాస్, గొట్టి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గడి జాన్సీ, విజయవాడ సిటీ ప్రెసిడెంట్ మహంతి వాసుదేవరావు, ఓబీసీ సాధన కమిటీ సభ్యులు నాయుడు, సిటీ కార్యదర్శి నడిమింటి రమణ, విజయవాడ సిటీ నాయకులు లోలుగు సురేష్, లోలుగు జగదీశ్, మహంతి సుబ్బారావు, ఆకుల గోవిందరావు, రామక్రిష్ణ, సుబ్రహ్మణ్యం, అధికసంఖ్యలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## క్షతగాత్రునికి రూ.10వేలు ఆర్థిక సాయం

(సత్యంన్యూస్, టెక్కలి)

నర్సింగపల్లి గ్రామం ఉర్జాన గణపతిరావుకు వైద్య సహాయం కోసం అభయం యువజన సేవాసంఘం మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. విజయనగరంలో కూలీపని చేసుకుంటూ రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లుకు తీవ్రగాయాలై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆర్థికసాయం కోసం ఎదురు చూస్తున్న బాధిత కుటుంబానికి గ్రామస్తులు కొంత ఆర్థిక సాయం చేశారు. ప్రస్తుతం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన తర్వాత మందులు కొనడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం రూ. 10వేలు ఆర్థిక సాయం అందించినట్లు అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. బాధిత కుటుంబానికి సాయం చేయడానికి పలు వురు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సేవా సంఘం ట్రెజరర్ శ్రీనివాస బెహరా, సంఘ సభ్యులు ధర్మవరపు పూర్ణాచారి, గురుగుబెల్లి సూర్యనారాయణ, జలుమూరు శశిభూషణ్‌లు పాల్గొన్నారు



## దూసి రైల్వేస్టేషన్‌లో గాంధీ స్మారక చిహ్నం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దూసి రైల్వే స్టేషనులో మహాత్మా గాంధీ స్మారక చిహ్నం ఏర్పాటు, స్టేషన్‌కు ఆనుకొని ఉన్న రెండెకరాల స్థలంలో గాంధీ, క్విట్ ఇండియా ఉద్యమ స్మారకస్థలిగా అభివృద్ధి చేయాలని ఇంటాక్ శ్రీకాకుళం విభాగం ప్రతిపాదించింది. ప్రతిపాదనలను మంగళవారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఇంటాక్ సభ్యులు పొన్నాడ రవికుమార్ అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రతిపాదనలు పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్, వాల్తేరు రైల్వ్ డివిజన్ డిఆర్ ఎంలకు సూచించారు. దూసి రైల్వే స్టేషనును మూడు నెలల కిందట ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు సభ్యులు కొమ్ము రమణ మూర్తి, పొన్నాడ రవికుమార్‌లు దూసి రైల్వే స్టేషనును సందర్శించి ప్రతిపాదనలు రూపొందించినట్టు వివరించారు.

## ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యూ జీనియస్ ఆల్ ఇండియా క్విజ్ కాంపిటీషన్–2024 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన పోటీలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని చక్కని ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ దేవ దత్తానంద్ విద్యార్థుల్ని మంగళవారం అభినందించారు. గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. విద్యార్థులను దగ్గరుండి విశాఖపట్నం తీసుకుని వెళ్లి సురక్షితంగా తీసుకొని వచ్చిన పాఠశాల తెలుగు సహాయకులు చాడ శ్రీనివాస్ సేవలను ప్రశంసించారు.



## కేసు పూర్వపరాలు సిసిటిఎన్ఎస్‌లో అప్లోడ్ చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కేసు నమోదు నుంచి అభియోగపత్రాలు దాఖలు వరకు కేసు లోని అన్ని అంశాలను సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో పూర్తి వివరాలతో అప్లోడ్ చేయాలని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. కేసులు పరిష్కారం, నిందితులకు శిక్షలు పడేందుకు కోర్టు కానిస్టేబుల్ విధులు చాలా కీలకమన్నారు. జిల్లాలోని పోలీసు స్టేషనుల్లో కోర్టు కానిస్టేబుళ్ళుగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, కోర్టులో సమన్వయ అధికారులుగా పని చేస్తున్న కోర్టు మానిటరింగ్ సిస్టం సిబ్బందితో ఎస్పీ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ళు, హెడ్ కానిస్టేబుళ్ళతో మాట్లాడి కోర్టు విధులు, వివిధ కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నెలవారీగా కోర్టులు జారీ చేసిన సమన్లు, వారంట్లును పోలీసుస్టేషను ప్రోసస్ రిజిష్టరులో నమోదు చేసి, రికార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లుతో సమన్వయం చేసుకుంటూ శిక్షల శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. కోర్టుల్లో

**- కోర్టు కానిస్టేబుల్ విధులు చాలా కీలకం**
**- ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి**

దాఖలైన అభియోగపత్రాలను న్యాయస్థానాలు దాఖలు చేసిన సమయంలో కేసు రికార్డును క్షుణ్ణంగా, నిశితంగా పరిశీలించి, అవసరమైన పత్రాలను సమర్పించే ముందు ప్రతి విషయాన్ని సంబంధిత పోలీసు అధికారులు దృష్టిలో పెట్టి,అభియోగ పత్రాలను కోర్టుల్లో దాఖలు చేయాలన్నారు. చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు విచారణ త్వరితగతిన ప్రారంభమయ్యే విధంగా చూడాలన్నారు. శిక్షలు పడేందుకు అవకాశం ఉన్న కేసుల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో మాట్లాడి సాక్షులు సాక్ష్యం చెప్పేందుకు బ్రీఫింగ్ ఇప్పించాలన్నారు. కేసు ప్రాపర్టీ సకాలంలో ప్రవేశపెట్టి, నిందితులకు శిక్షలు పడే విధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో కోర్టు కానిస్టేబుళ్ళు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రాధాన్యత కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించి, కేసు విచారణ త్వరితగతిన పూర్తయ్యే విధంగా చూడాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతిరోజు కోర్టులో జరిగే సాక్షులు విచారణ, అభియోగ పత్రాలు దాఖలు, సమన్స్, నాన్ బెయిబుల్ వారెంట్లు జారీ తదితర అంశాలను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టిలో పెట్టాలని ఎస్పీ దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో సిఎంఎస్ ఎస్ఐ పారినాయడు, డీసీఆర్బీ ఎస్సై నేతాజీలు పాల్గొన్నారు.

## కాన్సర్ బాధితునికి అండగా సాయికుమార్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్యాన్సర్‌తో బాధపడుతున్న అంపోలుకు చెందిన ఉట్ల హేమంత్ కుమార్‌కు పెదపాడుకు చెందిన పళ్ళ అప్పలసూరి మనవడు, బొట్ట సాయికుమార్ అండగా నిలిచారు. లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న హేమంత్‌కు వారానికి ఒక ఇంజక్షన్ చొప్పున, మూడు నెలలకు 12 తీసుకోవాలన్నారు. ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.7,500లు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి దీనస్థితిని జేసీ మణిశర్మ, ఉర్లం శివతేజ స్పందించి నగరానికి చెందిన డేవిడ్ మాదారపు టీంతో మూడు, రాబిన్‌హుడ్ ఆర్మీ ద్వారా రెండు ఇంజక్షన్లు అందించారు. అత్యవసరంగా ఇంజక్షన్లు కావాలని సంప్రదించగా బొట్ట సాయికుమార్ సహాయంతో రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ద్వారా రెండు ఇంజక్షన్లు అందించి కాన్సర్ బాధితునికి అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో కరగాన పూర్ణ చంద్రరావు, బొచ్చ జగదీశ్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు బి.చిన్మయరావు, బి.సతీష్, జి.రమణ, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా విశ్వకర్మ జయంతి




(సత్యంన్యూస్, పొందూరు)

కంచి కామాక్షి పొందూరు మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో దేవశిల్పి, సహస్ర ముఖుడైన విశ్వకర్మ జయంతి ఘనంగా జరిగింది. విశ్వకర్మని పటానికి పూలతో అలంకరించి పూజలు జరిపారు. సూర్యుడు కన్యారాశిలో ప్రవేశించిన సమయంలో భక్తులంతా పాల్గొని ఆరాధన గీతాలను ఆలపించారు. కార్యక్రమానికి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాకినాడ రాజారావు, అరసవల్లి వెంకటరావు ఆధ్వర్యం వహించారు. స్థానిక వార్డు సభ్యుడు అనకాపల్లి శివకుమార్ హాజరయ్యారు.

## పాఠశాలలో డీ వార్మింగ్ డే

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

పొన్నాడ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దుప్పలవలస డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో నేషనల్ డీ వార్మింగ్ డేలో భాగంగా స్థానిక హెల్త్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు కార్యక్రమం ఉద్దేశాన్ని హెల్త్‌అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు వివరించారు. కడుపు నులిపురుగులను నివారించి, రక్తహీనతకు గురికాకుండా చేసి, వ్యాధి నిరోధక శక్తిని పెంచి చదువు పట్ల, క్రీడలు పట్ల ఆసక్తిని పెంచుటకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆరు మాసాలకు నిర్వహిస్తూ ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే విద్యార్థులు నులి పురుగులు వ్యాధికి గురికాకుండా వుండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు తరచూ సబ్బుతో చేతులు కడగాలన్నారు. భోజనానికి ముందు, భోజనం తర్వాత, మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం 446 మంది విద్యార్థులకు మాత్రలు నమిలి, మింగించారు. కార్యక్రమంలో పొన్నాడ ఆరోగ్య విస్తరణ అధికారి జి.జగన్నాథరావు, ఏఎన్ఎమ్ జి.కమల, ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, పర్యవేక్షకుడు ఆర్.సురేంద్ర, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.



## హర్షవల్లి లయన్స్ క్లబ్ సేవలు భేష్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వచ్చత హి సేవా కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్‌క్లబ్ సేవలు హర్షణీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రశంసించారు. దోమల నివారణ చర్యలపై హర్షవల్లి లయన్స్‌క్లబ్ ముద్రించి కరపత్రాలను పంపిణీ చేయడంపై మంగళవారం కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా నగరంలో హర్షవల్లి లయన్స్‌క్లబ్ చేపడుతున్న స్వచ్చత కార్యక్రమాలను అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథ నాయుడు, వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఎన్.ఎస్.వి ప్రసాద్ (హారికా ప్రసాద్) వివరించారు. స్వచ్చత హి సేవా కార్యక్రమంలో పాల్గొన్నందుకు ప్రశంసిస్తూ, భవిష్యత్తులో సేవలు విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజల పక్షాన పోరాడుదాం

(సత్యంన్యూస్,టెక్కలి)

సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల పక్షాన పోరాడాలని వైకాపా సమన్వయకర్త పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. సోమవారం నందిగాం పార్టీ కార్యాలయంలో టెక్కలి మండల సర్పంచులు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తిలక్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వం గద్దెనెక్కి ప్రజలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి ప్రజల పక్షాన పని చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త ముందుకురావాలన్నారు. సూపర్ సిక్స్ వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి చివరకు కనీసం రైతులకు ఎరువులు కూడా ఇవ్వలేని పరిస్థితికి చంద్రబాబు ప్రభుత్వం దిగజారిందని ఆరోపించారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో వైకాపా కార్యకర్తలకు అండగా ఉంటానని, కార్యకర్త సమస్యలపైన, ప్రజా సమస్యలపైన నిరంతరం పోరాటం చేసి పార్టీకి పూర్వవైభం తీసుకురావడానికి అందరూ సహకరించాలని తిలక్ కోరారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ అట్ల సరోజనమ్మ,

**- వైకాపా సమన్వయకర్త పేరాడ తిలక్**

వైకాపా నాయకులు సత్తారు సత్యం, పేడాడ రమేష్, హనుమంతు వెంకటేశ్వరావు, పొట్నూరు వెంకట అప్పలస్వామి, గుజ్జు మోహన రెడ్డి, మొర్రి శంకర్‌రావు, వాన తవిటయ్య, కోరాడ కామేష్, పొందర శ్రీనివాస్, సర్లాన బాలకృష్ణ, బమ్మిడి కుర్మారావు, రాజేష్, తిరుమల రెడ్డి, మురళీ, అప్పలరెడ్డి, జన్ని చంద్రరావు, పొలకి మోహనరావు, అప్పలస్వామి, బాగది రామకృష్ణ, జగన్నాధం, జగ్గారావు, శంకర్రావు, మేస్త్రిరి, అన్నురావు, అట్లా రవి, రాహుల్, బలుసు, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.































# కొత్త ప్రభుత్వం మరీ 'స్మార్ట్'

(మొదటిపేజీ తరువాయి)

కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను బిగించి 29,122 మందికి ఉచిత విద్యుత్ అందిస్తుంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం పూర్తయిన తర్వాత ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లు బింగించే ప్రక్రియను జిల్లాలో ప్రారంభించారు. స్మార్ట్ మీటరింగ్ కోసం జిల్లాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.71.17 కోట్లు మంజూరు చేశారు. జిల్లాలో 200 యూనిట్లు కన్నా అధిక వినియోగం కలిగిన ప్రభుత్వ, పరిశ్రమ, కమర్షియల్ గృహ విద్యుత్ సర్వీసులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్, ఫీడర్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

**జిల్లాలో స్మార్ట్ మీటర్లు**

స్మార్ట్ మీటర్‌ను గృహ సర్వీసులకు దశలవారీగా అమర్చేందుకు అనువైన మార్గాన్ని సులువు చేసుకునేందుకు తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు అమరుస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి ఆటంకాలు లేకుండా అప్పుల కోసం లాబీయింగ్ చేసిన వైకాపా ప్రభుత్వం విద్యుత్ రంగంలో ప్రైవేటు సంస్కరణల అమలుకు 2021 నుంచే పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగంపై విడుదల చేసిన శ్వేతపత్రంలో విద్యుత్ రంగంలో ప్రస్తుతం అమలువుతున్న సంస్కరణలను యథాతథంగా ముందుకు తీసుకువెళతామని స్పష్టం చేశారు. అందులో భాగంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ విశాఖపట్నం నగరం నుంచి మొదలుపెట్టారు. తొలి మీటరును సీతమ్మధారలోని ప్రజారోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీల్లో సచివాలయాలు, ప్రజారోగ్య కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలకు బిగించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 8.68 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ వినియోగదారులు అత్యధికంగా 7.5 లక్షలు వరకు ఉన్నారు. గృహేతర (కమర్షియల్) సర్వీసులు 70వేలు ఉన్నాయి. 3,800 పరిశ్రమలు, 20 వేలు కుటీర పరిశ్రమల సర్వీసులు, 500 హెచ్‌టీ కనెక్షన్లు ఉన్నాయి. ఇవి కాకుండా 29,638 వ్యవసాయ పంపుసెట్ కనెక్షన్లు ఉన్నాయి. వీరందరికీ విద్యుత్ ఉద్యోగులు మాన్యువల్ లేదా స్కానర్ ద్వారా బిల్లులు తీసి అందజేస్తున్నారు. ఇప్పుడు ఈ ఉద్యోగాలు గల్లంతవడం ఖాయం.

**ప్రీపెయిడ్ విధానం అమల్లోకి**

స్మార్ట్‌మీటర్లు పూర్తిగా అమర్చాక సెల్‌ఫోన్ల రీఛార్జి మాదిరిగా ప్రీపెయిడ్ విధానం అమల్లోకి రానుంది. అది అమల్లోకి వచ్చిన తర్వాత నిర్ధేశించిన విద్యుత్ యూనిట్ల వినియోగం తర్వాత ఆటోమేటిక్‌గా విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. ఈ విధానం క్రమంగా అన్ని కేటగిరీ సర్వీసుల్లోనూ అమలుకానుంది. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం 200 యూనిట్లు మించి వినియోగదారులు సర్వీసులకు మాత్రమే స్మార్ట్ మీటర్ అమర్చనున్నట్టు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగించిన తర్వాత ప్రతి నెలా 10 నుంచి 15 రోజుల వ్యవధిలో బిల్లులు కట్టించుకుంటున్నారు. స్మార్ట్ మీటర్లు వచ్చాక అలా కుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తుందో సగటున అంచనా వేసి, ఆ మొత్తం ముందుగానే చెల్లించి మీటరును రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ఆ మొత్తం ఎంతనేది వినియోగం బట్టి మారుతుంది.


## 4వేల మందికి అన్నదానం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎచ్చెర్ల, తోటపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతో మానసిక శక్తి సిద్ధించడంతో పాటు సేవా దృక్పథం అలవడుతుందన్నారు. గ్రామాల్లోని యువత కలిసికట్టుగా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అం దుకే గత కొన్నేళ్లుగా ఎచ్చెర్ల, శ్రీకాకుళం నగరంలోని అనేక ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా పెట్టుకున్నానన్నారు. హిందూ ధర్మంలో ఆకలితో ఉన్న జీవికి ఆహారం ఇవ్వడం కంటే మంచి పూజ లేదని భావి స్తారని చెప్పారు. కార్యక్రమంలో సుమారు 4వేల మంది గ్రామస్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## మహోన్నత వ్యక్తి పెరియార్ రామస్వామి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మహోన్నత వ్యక్తి పెరియార్ రామస్వామినాయకర్ అని ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. రామస్వామి నాయకర్ 145వ జయంతి సందర్భంగా కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని జ్యోతీరావ్ పూలే పార్క్ ఏర్పాటుచేసిన పెరియార్ రామస్వామి నాయకర్ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ దేశంలో దక్షిణాది రాష్ట్రాల ప్రజల హక్కులు, అట్టడుగు వర్గాల అభివృద్ధికి నిరంతరం శ్రమించిన నేత పెరియార్ అన్నారు. కార్యక్రమంలో కొంక్యాన ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, బీసీ పార్క్ కోశాధికారి గుత్తు చిన్నారావు, పార్క్ అధ్యక్షుడు ఎం.ఏ.బేగ్, అదపాక రాంబాబు, కొంక్యాన శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 260 మంది విద్యార్థులకు కంటిపరీక్షలు

(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

జాతీయ అంధత్వ, దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 260 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.అవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకోవాలని దృష్టిలోపం ఉంటే ముందుగానే గుర్తించి కళ్లద్దాల ద్వారా సవరిస్తామన్నారు. విద్యార్థులు కంటి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కళ్లు గాయాల బారిన పడకుండా, వీడియోగేమ్‌లు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ మెరుగైన కంటిచూపును కాపాడుకోవాలన్నారు. శిబిరంలో ఆప్తాల్మిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న 18 మందిని గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫారసు చేశారు. విద్యార్థులకు 'కంటి ఆరోగ్యం-సంరక్షణ'పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణారావు, ఆరోగ్య కార్యకర్త పి.రేవతి, ఆశా కార్యకర్తలు ఎం.వాణిశ్రీ, పి.వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పట్టణ అధ్యక్షులు గులిమి సింహాచలం పాలాభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ భవనంలో మంగళవారం పట్టణ నాయీ బ్రాహ్మణుల సర్వసభ సమావేశం ఏర్పాటుచేశారు. శ్రీకాకుళం పట్టణంలోని నాయీ బ్రాహ్మణులందరూ హాజరై భవిష్యత్తు కార్యక్రమం రూపొందించారు. అక్టోబరు 1న పట్టణ నూతన అధ్యక్షుడు ఎన్నిక గూర్చి ఉమ్మడిగా చర్చించారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా దేవాలయాల కేశఖండన శాలలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ.20 వేల నుంచి రూ.25 వేలకు జీతభత్యాలు అమలయ్యేలా, అలాగే ఆలయ పాలకమండలిలో నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించేటట్లు జీవోలను ఏర్పాటు చేయడంపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్‌లకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కృష్ణప్రసాద్, కొండలరావు, నీలాద్రి, చిన్నారావు, శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయీ బ్రాహ్మణ సాధికారిక శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ కుప్పిలి వెంకట్రావు, కోట బొమ్మాళి సాధికారిక సభ్యులు పట్నాన భాస్కరరావు, రాష్ట్ర నాయ కులు తిరుపతిరావు, కన్నయ్య, చవిటిపిల్లి కొండబాబు, నాగరాజు, ఈశ్వరరావు, రవికుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.